


# స్వర్గానికి బెత్తెడు

ఇసుకపల్లి దక్షిణామూర్తి

రంభ దేవతావస్త్రాలు కట్టుకుని అద్భుతంగా నృత్యం చేస్తోంది. అమృతం సేవిస్తున్న దేవతలకు ఆమె కట్టుకున్న బట్టలు కనిపించటంలేదు, అనిమిషులకు కన్నుకొట్టటం చేతకాదు, కళ్ళప్పగించి పళ్ళు బయటపెట్టటం తప్ప. ఆ ఇకిలింపు గూడా ఇంద్రుడు చూడకుండానే.

పెగ్గుమీద పెగ్గు బిగించి బుద్ధికి వ్యస్తి చెప్పి మనస్సు గుర్రంపై స్వారీచేస్తున్న పగటి పెద్దమనుషులు డిస్కో-నంబరులో చుట్టూతిరుగుతున్న జూలీ కొంగు లాగుదామంటే చీర కనిపించటమేలేదు. వంటిపైనున్న ఆ కొంచెం అచ్ఛాదనా తీసేస్తే వక్కసారి చూసి ఆమెను నిలుచున్నపాటున అరెస్టుచేసి పట్టుకెళ్ళి సబిన్స్పెక్టరుకు దాఖలాచేద్దామని కానిస్టేబులు రాత్రి కలలుకంటున్నాడు.

రైలుపట్టాల కానుకున్న గుడిసెల బారులో ఒక కుటీరంలో లైటు వెలుగుతోంది. అందెల చప్పుడు వినబడుతోంది. గుమ్మందగ్గర నిలబడి గోపయ్య తలవంచి చూశాడు. మనిషి మోకాళ్ళవరకే కనిపిస్తోంది. ఆ పాకలో కూర్చున్నవాళ్ళు చప్పట్లు కొడుతున్నారు. కమ్మటి కల్లు కంపు గుప్పుమంటోంది. 'ఇటు రారా.... స్వామి ఇటు రారా....' పాట కళ్ళానికి గోపయ్య గుండె తగులుకుని గుబగుబలాడింది. అటూఇటూ చూసి గుడిసెలోకి దూరాడు. ఎదురుగా పోలీసు గోపాలస్వామి కనిపించేటప్పటికి గుండె గుభేలుమన్నది. వెళ్ళినవాడు వెళ్ళినట్లుగా బయటకు వచ్చిపడ్డాడు గోపయ్య. చూరు బుర్రకు కొట్టుకుంటే ఒక చేత్తో తలమీద రాసుకుంటూ బయట వదిలిన చెప్పులు ఎక్కడున్నాయో వెతుక్కోకుండానే వకచే పరుగు. పోలీసు గోపాలస్వామి గూడా అంత వేగంగా బయటకు లంఘించి పైకండువా జారిపోతుంటే లక్ష్యం చేయకుండా, చెప్పులెక్కడున్నాయో వెతుక్కోకుండా కనిపించిన మంచి జోడు కాళ్ళకు తగిలించుకొని, గోడకు ఆనించిన సైకిలయినా అందుకోకుండా వెంటబడ్డాడు. పాకలో అందెల చప్పుడు వినబడుతూనే ఉన్నది. 'స్వామి రారా....ఇటు రారా....' గోపాలస్వామి ఆ పిలుపును గూడా నిర్లక్ష్యంచేసి ఇటు రాకుండా అటువైపే పరుగెత్తాడు.

గోపయ్యను పట్టుకుని అప్పచెప్పిన గోపాలస్వామికి డిపార్టుమెంటు నుంచి 'శభాష్'లభించింది. గోపయ్య పనిచేస్తున్న ఫ్యాక్టరీ యజమాని గోపాలన్ నాయర్ నుంచి ఓ పచ్చకాగితం గూడా ముట్టింది. గోపయ్య పనిచేస్తున్న ఫ్యాక్టరీలో గొడవలయితే తప్పించుకొని తిరుగుతున్నాడు. అతన్ని పట్టుకుని విచారణ జరిపించి ఉద్యోగానికి తిలోదకాలిప్పించే ప్రయత్నంలో భాగమే ఇది.

దొరికిన గోపయ్యమీద ఫ్యాక్టరీలో విచారణ జరిగింది. 'నువ్వు నేరం చేశావు ....స్టాండింగు ఆర్డరు కింద.... ఫలానా అక్టు....ఫలానా సెక్షను కింద.... ఫలానా రూలుప్రకారం నువ్వు దోషివి....ఫ్యాక్టరీ ఆవరణలో అసభ్యంగా ప్రవర్తించావు... గదిలో చీపురుపెట్టటానికి మాదమ్మవెళితే నువ్వు వెనకేవెళ్ళి తలుపు వేసుకున్నావు ....నిన్ను నిలబెట్టి అడిగినందుకు చౌకీదారును కొట్టావు....అక్కడేఉన్న పెన్నుస్టాండు విరగ్గొట్టి....ఫ్యాక్టరీ ఆస్తికి నష్టం కలిగించావు....అందుకు సాక్ష్యం.... గోపాలరావు.... గోపీచంద్ .... గోపతి ....గో....'చూపుడు వేళ్ళన్నీ గోపయ్య వైపు తిరిగాయి.

కత్తెర వకటి తీసుకుని ఆ వేళ్ళన్నిటినీ కత్తిరించి దూరంగాపారేస్తే వాళ్ళు ఇంకెప్పుడూ వేలెత్తి చూపరు అనుకున్నాడు గోపయ్య. కంటిచూపు పదును మొండి కత్తిలాగా పనికిరాకుండా పోయింది.

'ఇంతేకాకుండా .... మానేజరు స్టీలు కారియరు నువ్వు ఎత్తుకుని పారిపోతుంటే ....ఎర్రచేతులతో పట్టుకున్నారు....'

'ఎర్రచేతులేమిటండీ....' మానేజరు అడిగాడు. ఎంక్వయిరీ ఆఫీసరు గోపాలకృష్ణవంక చూశాడు గోపతి.

'విచారణ తెలుగులో జరగాలంటే అట్లా అడిగాను...కాట్...రెడ్ హేండడ్.. ఆ మాట తెలుగులో అర్థమయేట్లు గోపయ్యకు చెప్పండి....'

'నువ్వు.... స్టీలుకారియర్ దొంగిలించినప్పుడు.... ఆ స్టీలుకారియర్....నీ చేతుల్లో ఉండగా.... ఆ ఎర్రటిచేతులు ఛ....ఛ.... ఎర్రటివి కాదు.... నువ్వు పట్టుకుపోతుండగా చూశారు....చూడడం కాదు.... ఆ కారియరు పట్టుకున్నారు. ధూ.... కారియరును కాదు.... నిన్ను పట్టుకున్నారు....'

'నాకే తికమకగా ఉంది.... విచారణ

జరిగేటప్పుడు.... నేరస్థుడికి ఆ నేరం ఏమిటో అర్థంఅయ్యేట్లు చెప్పటం అవసరం....'

'ఆ ఎర్రటి కారియరుకు.... కాదు మళ్లీ చెపుతాను.... నువ్వు కారియరును పట్టుకుంటూ.... నిన్ను చౌకీదారు పట్టుకున్నాడు.... ఊ.... అదే.... ఇప్పుడు అర్థం అయిందా....'

గోపయ్య దిక్కులు చూశాడు.

'నీ సంజాయిషీ ఏమిటి....నేరం ఒప్పుకుంటున్నావా....' ఆఫీసరు అడిగాడు.

'నేరం రుజువు అయేదాకా....నేరస్తుడిగా పరిగణించగూడదు ....గోపయ్యకు గూడా ఒక కుర్చీ వెయ్యండి.... ఆ .... కూర్చుని చెప్పు గోపయ్యా....'

తలమంచి వణుకువచ్చింది గోపయ్యకు మనిషి కనిపించాడు.

'చూశారా....నటన....వెధవ వణుకూ వాడూను..మన సానుభూతికోసం దొంగ వేషాలు....ఈ అలగాజనమే ఇంత....'

గోపయ్య వణుకుతోంది జాలికలగటం కోసం కాదు. ఫ్యాక్టరీలో ఉద్యోగం ఊడే స్థితికి వచ్చింది. ఈ తతంగం అంతా అందుకోసమే ఈ ఉద్యోగంపోతే తనకు భోజనం గడవటం కష్టం అవుతుంది. తనను నమ్ముకుని హైదరాబాదు వచ్చిన పారమ్మకు ద్రోహంచేయలేదు. ఇప్పుడు భార్యకు పురుడువచ్చేరోజులు. నెలరోజులుగా కూలికి పోవటం లేదు. డాక్టరమ్మ పరీక్షచేసింది. కానుపు కష్టంకావచ్చుననీ, మందులూ, రోజూ పాలూ, పళ్ళూ తీసుకోవాలనీ చెప్పింది. పాలు ఎట్లాఉంటాయో పారమ్మకేం తెలుసు. తల్లిపాలుతాగిందో లేదో!!

తాను నిజానికి ఏ నేరం చేయలేదు. మాచమ్మతో మానేజరు సరసాలాడుతుంటే పట్టుకుని తన్నాడు. ఆ కొట్లాటలో మాచమ్మ మానేజరుకు చీపురుతో నాలుగు వడ్డించింది. అదీ కసి. మాచమ్మ గదిలోకి వెళితే వెనకాలగా దొంగతనంగా వెళ్ళి తలుపువెయ్యాల్సిన అవసరంలేదు తనకు. మోజు కలిగితే దర్జాగా గుడిసెలోనే కలవగలడు. అయినా తనకు అక్కర లేదు. పారమ్మను మనువు ఆడాడు. పైలాపచ్చీసుగా కాపరం నడుస్తోంది. తను తండ్రి కాబోతున్నాడుకూడా. అయితేగోపయ్యకు వచ్చిన కష్టాల జాబితాలో అందమైన విగ్రహం ఒకటి. సినిమాల్లోచేరితే హీరో అయిపోయి సినీ అందగత్తెలకు మనో నాయకుడయి చుక్కల్లో చంద్రుడిలాగా వెలిగిపోయేవాడు. కానీ ఈ ఫ్యాక్టరీలో వచ్చిపడ్డాడు.

మొదటినుంచీ తానేమంత బుద్ధిమంతుడనికాదు. నౌకరీ కుదరకముందు లారీల మీద కూలికి తిరిగేరోజుల్లో కొద్దోగొప్పో చెడుతిరుగుళ్ళ అలవాటు పడ్డవాడే.



ఆదాక జీవితం. గొప్పోళ్ళ పంథాలో నడిచింది. నిద్రలేస్తుండగా టీ దొరికేది. గుడిసె దగ్గరికే లారీవచ్చి ఎక్కించుకుని పోయేది. నాస్తా, భోజనం .... పొద్దూగ్గానే ఓ గ్లాసుడు నా టు సా రా.... ఆ దెబ్బతో పగలు ముక్కలయిన శరీరం మళ్ళీ అతుక్కుని మర్నాటి కష్టానికి తయారయ్యేది. ఆ గుక్కెడు గొంతులో పోసుకోకపోతే దేశంలో కూలిజనం అంతా ముక్కలు ముక్కలై అంతరించి పోయేది. పడుకునేవేళకి గానాబజానా.... రావులమ్మ....రుక్కు...సత్తి...దేవమ్మ.. ఎవరయితేనేం వంటరితనం లేకుండా జంటకుదిరేవారు. ఇప్పుడు ఆ గొడవలన్నీ లేవు. ఎప్పుడన్నా ఎవరన్నా కనిపించినా నవ్వేసి ముఖం తప్పించేస్తాడు కాని అటుపక్కకు పోడు.

ఫ్యాక్టరీలో చేరినప్పటినుంచీ మానేజరు దగ్గర టైపిస్టుగా పనిచేసే మోహిని తనను ఓ కంట ఓరగా చూస్తూనే ఉండేది. ఆఫీసుపని ఎంతైనా టకటకాచేసి అక్కడ పెట్టేస్తుంది. మానేజరుకు ఆఫీసు పనితో తృప్తికలగటంలేదు. ఆమెను మింగేస్తున్నట్లుచూస్తాడు. ఓసారి మోహిని చెప్పు తీసి చూపించింది. గోపయ్య కర్మకాలి ఆ సన్నివేశానికి సాక్షి అయ్యాడు. మోహినినవ్వింది. నవరాత్నాలు రాలాయి వెన్నెల వెదజల్లింది. తడిసిముద్దయ్యాడు.

పారమ్మ బాగానే ఉంటుంది. అయితేనేం పారమ్మ నాటుసారా అయితే మోహిని విదేశీవిస్కీ.

ఫ్యాక్టరీ యాజమాన్యం గోపయ్య మీద నేరం మోపటానికి మోహిని మరో అందమైన కారణం.

'నే రం ఒప్పుకుంటున్నావా .... లేదా....'

గోపయ్య ఉలిక్కిపడ్డాడు.

'మీరు చెప్పేది నిజంకాదు.... నేను గదిలోకి వెళ్లినప్పుడు మాచమ్మ లేదు. మంచినీళ్లు తెద్దామని కూజాకోసం వెళ్లాను. మంచినీళ్లుతెమ్మన్న టైపిస్టుగారే ఉన్నారక్కడ... ఆ మోహినిగారు.... నన్ను బయటకు పోనివ్వలేదు.... తలుపుతీసి వస్తుంటే మేనేజరుగారు మండిపడ్డారు ... ఉద్యోగంలోనుంచి తీసెయ్యాలన్న పన్నాగం.... ఆ మోహిని....'

ఆఫీసరుగారు తికమకపడ్డారు.

'మోహిని....మోహిని అంటాడు.... ఆమె ఎవరు....ఈ ఎంక్వయిరీలో ఆమె సాక్షికాదా....! ఆమెను ఎందుకు పిలువలేదు....?'

ఆయనకు గూడా మోహిని ఎట్లా ఉంటుందో చూడాలనిపించి పట్టింది. ఇంత మందిని సమ్మోహితులను చేసిందంటే ఆ చూపుల్లో మత్తుమందు

ఏదో ఉంది.

'మరి స్టీలు కారియరు దొంగతనం... దాని మాటేమిటి....'

'నేను దొంగతనం చేయలేదండి.... దాంట్లో అయ్యగారికి రోజూ భోజనం తెస్తుంటాను.... ఆ రోజు కూడా భోజనం అయిన తర్వాత కారియరు తీసికొని పోతూంటే మోహిని పిలిచి....'

'ఆ మోహిని ఎవరో ఒకసారి పిలవండి....' ఎంక్వయిరీ ఆఫీసరుగారి మనస్సు ఆరాటపడుతోంది.

'ఆమె ఎందుకండీ మధ్యలో....మీరు ఇక్కడ ఎంక్వయిరీ చేయటానికి వచ్చారా.... ఆడవాళ్లతో మీకేమిటి పని....'

నిజంగా మోహిని అక్కడకు వస్తే ఏం చెపుతుందో ఈ ఆఫీసరు ఏమని రిపోర్టు ఇస్తాడోనని మేనేజరు జంకాడు.

'కారియరు సంగతి అడగండి.... చేతిలో కారియరు ఉందా లేదా.... చౌకీదారు నిన్ను ఆటకాయించి ఎర్ర ఎర్రచేతులుగా పట్టుకున్నాడా లేదా.... అడిగిందానికి చెప్పు....!

'చూశారా .... తలకాయ ఆడిస్తున్నాడు.... అంతవరకు వ్రాసుకోండి.... మిగతా సోది అంతా అనవసరం....'

'నువ్వే నేరం చేశావు....'

'నువ్వు నేరస్థుడివి....'

నౌకరీలేక, కూలీ దొరక్కపోతే వాళ్ల స్థితి ఎట్లా ఉంటుందో తాను చాలామందిని చూశాడు.... ముష్టివాళ్లలాగా అయిపోతారు. అభిమానం చచ్చేదాకా పస్తులున్నా, ఆ పైన దర్జాగా అడుక్కుతినేవాళ్లని తన గ్రామంలో చిన్నప్పుడు గోవయ్య చూసి వాళ్లట్లాగే పుటతారని అనుకునేవాడు. తర్వాత తర్వాత తెలిసింది, తనుగూడా ఆ మందలో కలిసిపోతాడేమోనని ఒక్కసారి భయం వేసింది. వణుకు వచ్చింది. మంచుగడ్డ కంటే చల్లగా ఉంటుంది పేదరికం. అతన్ని మళ్లీ ఫ్యాక్టరీలో అడుగుపెట్టనివ్వలేదు. అదే ఆఖరు రోజు.

అతను రాకపోవటం వలన ఫ్యాక్టరీ చక్రాలు ఆగలేదు. కాలచక్రం స్తంభించ లేదు..... ఓ రోజు బొంబాయి నుంచి కొత్త పార్టీలు వస్తే గోపాలన్ నాయర్ పార్టీ ఒకటి ఏర్పాటుచేశాడు.

'ఈ అలగా జనంతో చచ్చిపోతున్నాం.... మీ ఫ్యాక్టరీలో గూడా లేబర్ ప్రాబ్లం ఉందా....!' గోపాలన్ నాయర్ పకోడి నోట్లో వేసుకుని ఖాళీ గ్లాసు టేబులు మీద పెట్టి 'ఫ్రిజ్‌లోనుంచి ఇంకోసీసా తీయరా....' అన్నాడు.

'సోడా తెమ్మంటారా_అయ్యగారూ.'



'వద్దులేరా .... ఆపాటు తాగుతేనే నయం....'

'చిత్తం....'

'పనివాళ్లు మంచివాళ్లే .... ఈ యూనియన్‌వాళ్లు వచ్చారు.... వాళ్లతోటే గొడవ.... మీకేం కోపం లేదుగదా....' గోపాలన్ నాయర్ రవిరాజువంక చూశాడు. బొంబాయి యూనియన్ సెక్రటరీ రవిరాజు.

బొంబాయి ఫ్యాక్టరీ మేనేజరు చంద్రగుప్త నవ్వేశాడు. నాయరు కోమలంగా రవిరాజు యూనియన్‌ని కొంతకు తగిలించగలడు.

'ఇట్లాంటిచోట మనం కలిసినప్పుడు మన వృత్తుల్ని, వృత్తి ధర్మాల్ని మరిచిపోయి .... మనిషి .... మనిషి.... మానవత్వం.... మనస్సు .... మాన్.... టూ....మాన్....' రవిరాజు ఒకసారి లేచి నిలబడి పళ్లు నిరుచుకుని మళ్లీ కూర్చున్నాడు. గ్లాసు గడగడా తాగేశాడు.

'ఈ పనివాళ్లతో చాలా ట్రబుల్ .... కఠినం లేకపోతే చాలా ప్రమాదం గూడాను.' గోపాలన్ నాయర్ మళ్లా ఓ గ్లాస్ తాగేశాడు. 'వాళ్లని ఎప్పుడు చెప్పు కిందనే ఉంచాలి గుర్నాగారూ....!

'మీరు గురుగారూ..అన్నది నన్నా... రవిరాజుగారినా....!' చంద్రగుప్త గ్లాసు వెతుక్కుంటూ అడిగాడు.

గోపాలన్ నాయర్ ఏదో మాట్లాడబోయేటప్పటికి కొనసాగినట్లయింది.

'కొనబారిందంటే ఎవరో తలుచుకుంటున్నట్లున్నారు.... కొంపతీసి ఆ మోహిని.... మీ పైపిస్తు తలచుకోవటం లేదు కదా....!'

'ఆమె మీకెట్లా తెలుసు?'

'భస్మాసురు లందరికీ మోహిని తెలిసే ఉంటుంది.... రవిరాజాగారూ.... నేను కరెక్టుగా మాట్లాడుతున్నా.... ఓ దోసు ఎక్కువయిందేమో గాని.... అంతా తెలుస్తూనే ఉన్నది....' కుర్చీలోంచి జారిపోతూ మళ్లీ పైకి సర్దుకున్నాడు చంద్రగుప్త.

'మోహినీ.... ఇంతెక్కడి మోహినీ.... గోపయ్య అని ఉండేవాడు. వాడిని ఉద్యోగంలోంచి తీసేసేటప్పటికి తనూ రాజీనామా ఇచ్చి వెళ్లిపోయింది.. వాడంటే పడిచచ్చేది.... ఏం చూసి అంత మోజో!'

'ఏ కారణం లేనిదే మోజు అంటే.... కారణంగా కలిగిన మోజు కారణం పోగానే వదిలిపోతుందిట.... అందుకని కారణంగా ఉన్న అభిమానమే మోజు.... అని ఓ ఇంగ్లీషు రచయిత అన్నాడండి.'

'మీరే అని.... ఇంగ్లీషువాడికి కీర్తి అంటకటుతున్నారు.... మొహమాట పడుతున్నారు....' వెకిలినవ్వు పళ్లమధ్య ఇరుక్కుని గిలగిలలాడింది.

'గోపయ్య మంచి పక్కారే.... ఈ మోహిని చెడగొట్టింది.... వాడిని వదిలించుకోటానికి తలప్రాణం తోకకు వచ్చింది.... ఎంక్వయిరీ పెట్టాం.... రాడు.... నోటీసు ఇచ్చాం తీసుకోడు.... పేపర్లో వేయించాం.... చదవలేదు.... అన్నాడు.. పోలీసువాడికి దక్షిణ ఇచ్చి తన్నించాం..పైగా ఎదురు నోటీసులు... కేసులు.... అబ్బబ్బ ప్రాణం తీసేశాడు. ఆ ట్రబుల్ చెప్పటానికి వీల్లేదు....' పీసాలందించి సుబ్బారావు అక్కడే ఉన్నాడు.

'ఏరా..మా మాటలు వింటున్నావా.. 'వెధవా' అని వీడూ అంతే! నంగిలాగా ఉంటాడా.... వ్యవహారం చెడిందంటే వీడూ అంతే.... ఏంరా?'

'లేదండి .... అయ్యగారూ .... మీ ఉప్పుతిని ద్రోహం చేసేటివాణ్ణి....'

'మాటలు నేర్చాడు .... ఉప్పు తిన్నాడూ.... అంటే సున్నం పెట్టాడూ అన్నమాటే.... గోపయ్య ఎంత వినయంగా ఉండేవాడు .... ఎంత ట్రబుల్ ఇచ్చాడూ.... హారిబుల్ ఫెలో.. ఈ సుబ్బారావు అల్లాంటివాడు కాదు.... చెప్పినమాట వింటాడు .... ఈ రోజు కోడికూర కావాలి అన్నా. ఓ దిట్టంగా ఉన్న ఎర్రకోడిని చూపించి వండు.... అన్నాను.... వండేశాడు.... ఏరా....!'



'వండాను కానండి.. అయ్యగారూ... చాలా కష్టం అయిపోయిందండి.... బుట్ట తీయగానే పారిపోయింది .... పక్క దొడ్లోకి పోయింది.... అక్కడనుంచి డాబా మీదకు గెంతింది. పట్టుకోబోతే ఎగిరింది.... ఇల్లూ వాకిలి.... అంతా తిప్పింది.... పట్టుకొని పీక కోసేటప్పటికి నా తలప్రాణం తోకకు వచ్చింది.... అయ్యగారూ .... చాలా ట్రబుల్ ఇచ్చిందండి....'

గోపాలన్ నాయర్ నిషాలోనే ఉలిక్కిపడ్డాడు.

'ఏరా.... ఏమన్నావురా.... ట్రబుల్ ....అన్నావా.... ఆ....' మనస్సు అంతా మసగ్గా ఉంది. ఎవరో మనిషి కోడి రెక్కలు కట్టుకుని కత్తికి దూరంగా పరుగెత్తుతున్నాడు. ఎగురుతున్నాడు. అలిసిపోతున్నాడు. కత్తి పదును ఎండలో మెరుస్తోంది. తనకు ట్రబుల్ ఇస్తున్నాడు గోపయ్య.

తను మించి తాగినట్లున్నాడు. వళ్ళు తెలియటంలేదు. కుర్చీలోనుంచి పూర్తిగా జారిపోయాడు. గడియారం ఆగినట్టుంది. ఎంతసేపయిందో! ఎవరో తీసుకెళ్ళి ఎత్తుకుని రిక్షాలో పడుకోబెట్టారు.

'జాగ్రత్తగా తీసుకెళ్ళి ఇంటి దగ్గర దిగబెట్టు....ఇంటి నంబరు .... పేరు.... ఆ కాగితం జాగ్రత్త–ఈ అయిదురూపాయిలు తీసుకో...ఇంటిదగ్గర మళ్ళీ డబ్బులడిగేవ్....దొక్క చీరేస్తాను....' గోపాలన్ నాయర్‌కు మాటలు వినబడుతున్నాయి. వంటరితనం చుట్టుముట్టింది. కుదుపుకు రిక్షాకమ్మీలు తలకు కొట్టుకుంటున్నాయి. నెప్పి తెలుస్తోంది గాని చేత్తో రాసుకోవటానికి చెయ్యి లేవడం లేదు.

రిక్షావాడివంక చూశాడు. కల్లుకంపు, చెమటకంపు. కళ్ళు, ముఖం పీక్కుపోయి పెరిగిన గడ్డంలోంచి తొంగి చూస్తున్నాయి. గోపాలన్ నాయర్‌కు కొంచెం స్పృహ తెలుస్తోంది. కళ్ళు నులుముకుని చూశాడు. రిక్షావాడు ఎవరూ ....ఎక్కడో చూసినట్లుంది. గోపయ్య లాగా కనిపించాడు. అందరూ గోపయ్య లాగానే కనిపిస్తారు ఇప్పుడు.

'నువ్వూ....'

'నేనే...గోపయ్యనే అయ్యగారూ...

'ఆ....!! ఏంటిరా ఇట్లా అయిపోయావు....?'

గోపయ్యకళ్లు ఏనాడో ఎండిపోయాయి.

'బాగానే ఉన్నాగదండి అయ్యగారూ..'

'ఈ వాలకం ఏమిటి....ఏంచేస్తున్నావు ....ఇప్పుడు ....' గోపాలన్ నాయర్ రిక్షాలో సర్దుకుని కూర్చోవటానికి ప్రయత్నిస్తున్నాడు.

'రిక్షా తొక్కుతున్నానయ్యగారూ ....తమరూ బాగా తగ్గిపోయారు....'

'అవునురా....నీకు అన్యాయం చేశానురా.... ఆ మోహినీ....దక్కలేదు.... నేనే అన్యాయం అయిపోయాను....'

'అదేంటయ్యగారూ....'

'ఆ సంగతి వదిలెయ్యరా .... బుర్ర పాడయిపోతూంది....నీ పెళ్ళాం పిల్లలూ బాగున్నారటరా....'

'ఎవ్వరూ లేరు.... అంతా పొయ్యారు అయ్యగారూ .... నా పారమ్మకు పెరిట్లో జబ్బుచేస్తే .... దక్కించుకోలేకపోయానయ్యగారూ....'

గోపయ్యగొంతు జీరపోయింది. ఒక చేత్తో కళ్ళు అద్దుకుని ముఖం తుడుచుకోబోయాడు. హేండిలు చెయ్యి జారింది. తనుపోయే రోడ్డు అంతా గోతులు. బండి పక్కకు దొర్లుకుపోతోంది.

'సరిగ్గా పట్టుకోరా .... జాగ్రత్తరా' కంగారు, కోపం.

రిక్షా తొణికింది. ఎదురుగుండా లారీ లైట్లు స్వర్గదీపాల్లాగా మెరుస్తున్నాయి. ఎంత వెలుతురు! తనను ఆహ్వానించటానికి అన్ని మేళతాళాలెందుకు? చెవులు చిల్లులు పడుతున్నాయి. గోపాలన్ నాయర్‌కు ఏం జరిగిందో, ఏం జరుగుతుందో తెలియటంలేదు. కళ్ళు మూతలు పడుతున్నాయి.

'ఇంకెంతదూరం....' తన మాటలు గొంతులోనే ఉన్నాయి. నలుగురూ చేరి ఎవరికి తోచింది వాళ్ళు మాట్లాడుతున్నారు

'పుల్ దోములో ఉన్నట్లున్నాడురా గురుడు....'

'దెబ్బ బాగానే తగిలింది....'

'లారీడ్రైవరు పారిపోయినట్లున్నాడే'

'రిక్షావాడెక్కడ .... వాడిని పట్టుకుని తన్నాలి గాడిదకొడుకుని....'


గోపయ్య పకపక్క అచేతనంగా పడి ఉన్నాడు.

'ఎంతదూరం ఉంది....'

'ఓ వెత్తడు....'

అమృతం గుబాళింపు ముక్కు పుటాలను పలకరిస్తోంది. రంభ అద్భుతంగా నృత్యం చేస్తోంది. మోహిని నృత్యం నేర్చుకుని ఆ వేషం వేసుకుంటే అట్లాగే ఉంటుంది. తనెక్కడ ఉన్నాడు! గోపాలన్ నాయర్ మూతపడిన కన్నుల్లోంచి అంతా కనిపిస్తూనే ఉంది.

ఇంద్రుని సింహాసనంలో గోపయ్య కూర్చుని నవ్వుతున్నాడు.






# ఎనిమిది

లోకనాథం

'నీకు త్యాగరాజు తెలుసా రేఖా?'

'ఎవరండీ ఆయన?'

'తెలియదన్నమాట!'

'తెలియదండీ!'

'దీక్షితులవారు తెలుసునా?'

'ఏ దీక్షితులండీ?'

'ముత్తుస్వామి దీక్షితులనీ — పోనీ తుంబుర నారదులు — నారదుడు తెలియదూ?'